క్లుప్తంగా

కండక్టర్ కొలూరికి డాక్టరేట్



చెన్నైలో డాక్టరేట్ అందుకుంటున్న కండక్టర్ కొలూరి ప్రసాదరావు

గోపాలపురం: ఆయన పేరు కొలూరి ప్రసాదరావు. స్వగ్రామం మండలంలోని వేళ్లచింతలగూడెం. వృత్తి కండక్టర్. జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపోలో విధులు నిర్వహిస్తున్నారు. అయితేనేం ఆయనకు సాహిత్యం అన్నా, చదరంగం అన్నా ఎనలేని మక్కువ. నిబద్ధతతో కండక్టర్ విధులను కొనసాగిస్తూనే తన కిష్టమైన రెండు రంగాల్లోనూ విశేష కృషి చేసి డాక్టరేట్ అందుకున్నారు. చెన్నైలోని టి.నగర్ సోషల్ క్లబ్ నుంచి ప్రసాదరావుకు డాక్టరేట్ లభించింది. ఇంటర్నేషనల్ పీస్ సమ్మిట్ అధ్యక్షుడు డాక్టర్ మధుకిసాన్ చేతుల మీదుగా సోమవారం తాను డాక్టరేట్ స్వీకరించినట్టు ప్రసాదరావు తెలిపారు. ప్రసాదరావు గతంలో కవి మిత్ర, కథాభారతి, సాహితీ చదరంగ ప్రపూర్ణ, కళారత్న బిరుదులు పొందారు. డాక్టరేట్ అందుకున్న ప్రసాదరావును పలువురు అభినందించారు.

అన్నవరప్పాడులో వీరన్నబాబు సంబరం


వీరన్నబాబు కత్తె, నాగదేవతల ప్రతిమలు, తాంబూలాలతో వస్తున్న భక్తులు

పెరవలి: అన్నవరప్పాడులో కొలువైన వీరన్నబాబు సంబరాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. వీరన్నబాబుకు ప్రతి రూపంగా కత్తె, నాగ దేవతల ప్రతిమలను అన్నవరప్పాడు నుంచి మేళ తాళాలతో ఊరేగింపుగా మల్లేశ్వరం గ్రామంలోని గోదావరి నది వద్దకు తీసుకు వెళ్లారు. భక్తులు అక్కడ కార్తిక పుణ్య స్నానాలు ఆచరించాక ఊరేగింపుగా అన్నవరప్పాడు తీసుకు వచ్చారు. అనంతరం సామూహిక వన సమారాధన నిర్వహించారు. సుమారు మూడు వేల మంది భక్తులు హాజరయ్యారు.

నేల నంటిన వరి పైరు


పెరవలి మండలం కొత్తపల్లిలో నేల నంటిన వరి పైరు

పెరవలి: తుపాను ప్రభావంతో ఆదివారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షాలకు వరి చేలు నేలనంటాయి. ఖరీఫ్‌లో నిడదవోలు నియోజకవర్గంలో 36,500 ఎకరాల్లో వరిసాగు చేశారు. నియోజకవర్గంలో ఇప్పటికే 50 శాతం వరి పంటను ఒబ్బిడి చేయవలసి ఉందని వ్యవసాయాధికారులు తెలిపారు. నేలనంటిన వంట ధాన్యం రాలిపోయి, దిగుబడి తగ్గిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలకు పల్లపు చేలు నీట మునగడంతో ధాన్యం మొలక వచ్చే ముప్పు ఉందని పేర్కొంటున్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి దొండపాదులు, అరటి, కంద, కూరగాయల పంటలు నీట మునిగి ఉన్నాయి. మండలంలో కూరగాయల పంటలు 4 వేల ఎకరాలు, అరటి తోటలు 3,500 ఎకరాల్లో సాగవుతున్నాయి. ఇందులో 2 వేల ఎకరాలపైగా విస్తీర్ణంలోని పంటలు నీట మునిగాయి. ఈదురు గాలులకు అరటి తోటలు నిలువునా విరిగిపోతున్నాయి. అన్నవరప్పాడు, నల్లాకులవారిపాలెం, ఖండవల్లి గ్రామాల్లో ఈదురుగాలులకు రోడ్ల పక్క చెట్లు విరిగిపోవడంతో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

అండగా ప్రభుత్వం.. గట్టెక్కిన రైతులు

- వెన్నుదన్నుగా నిలిచిన అధికారులు
- నిబంధనల సడలింపుతో వేగంగా ధాన్యం కొనుగోళ్లు
- పంట నష్టం లేకుండా బయట పడిన అన్నదాతలు
- వణుకుతున్న పొగాకు రైతులు


దేవరపల్లి మండలం గౌరీపట్నం వద్ద కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లుకు తరలిస్తున్న రైతులు

దేవరపల్లి: మిచాంగ్ తుపాను ప్రభావంతో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని మెట్ట ప్రాంతంలో సోమవారం ఈదురు గాలులతో కూడిన వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. ప్రస్తుతం ఈ ప్రాంతంలో వ్యవసాయ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. వరి, పొగాకు పంటలు సాగులో ఉన్నాయి. వరి కోత దశలో ఉంది. రైతులు ఇప్పటికే 70 శాతం పంటను కోసి గిట్టుబాటు ధరకు అమ్ముకున్నారు. 10 శాతం ధాన్యం రోడ్లపై రాసులుగా పోసి ఉన్నాయి. తుపాను హెచ్చరికల నేపథ్యంలో ఆరబెట్టిన ధాన్యాన్ని రైతులు రాసులుగా పోసి బరకాలు కప్పి ఉంచారు. బరకాలు ఉన్నప్పటికీ రాసుల అడుగు భాగం నుంచి వర్షపు నీరు పారడంతో ధాన్యం కొంతమేర తడుస్తుందని రైతులు తెలిపారు. గోపాలపురం నియోజకవర్గంలోని దేవరపల్లి, నల్లజర్ల, గోపాలపురం, ద్వారకాతిరుమల మండలాల్లో సుమారు 90 శాతం వరి కోతలు పూర్తయినట్టు అధికారులు తెలిపారు. తుపాను హెచ్చరిక వల్ల కొన్ని రోజులుగా వరి కోతలు నిలిచిపోవడంతో మిగిలిన 10 శాతం పంట పొలాల్లో ఉందని వ్యవసాయ శాఖ అధికారులు చెప్పారు.

పొగాకు తోటలకు నష్టం

ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వల్ల పొగాకు తోటలకు నష్టం వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మెట్ట ప్రాంతంలో వర్జీనియా పొగాకు ప్రధాన వాణిజ్య పంట. సుమారు 60 వేల ఎకరాల్లో ఈ పంట సాగులో ఉంది. వర్షాలకు తోటలు దెబ్బతింటాయని రైతులు తెలిపారు. దిగుబడి, నాణ్యత తగ్గుతుందని వివరించారు.

88.104 ఎకరాల్లో సార్వా సాగు

ఈ సార్వా సీజన్‌లో కొవ్వూరు డివిజన్‌లో 88,140 ఎకరాల్లో వరి సాగు చేశారు. 2,31,273 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటి వరకూ సుమారు 80 వేల ఎకరాల్లో వరి కోతలు పూర్తయినట్టు అధికారులు తెలిపారు. ధాన్యం కొనుగోలుకు 79 మిల్లులను ఏర్పాటు చేశారు. ప్రభుత్వాదేశాల మేరకు అధికారులు ఎప్పటి ధాన్యం అప్పుడు రైతుల నుంచి రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసి రైతుల ఖాతాలకు సొమ్ము జమ చేస్తున్నారు. ఈ ఏడాది దిగుబడులు ఆశాజనకంగా ఉండడంతో పాటు గిట్టుబాటు ధర ఇవ్వడంతో రైతులు ఆనందంగా ఉన్నారు. ఇలాంటి తరుణంలో మిచాంగ్ తుపాను ఇబ్బంది పెడుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


కొవ్వూరు మండలం కాపవరం వద్ద రోడ్డుపై గల ధాన్యం రాసులను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

నిబంధనల సడలింపు



ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం నిబంధనలను సడలించింది. తుపాను కారణంగా రైతులు నష్టపోకూడదనే ఆలోచనతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ధాన్యంలో తేమ శాతం ఎక్కువగా ఉన్నప్పటికీ కొనుగోలు చేస్తున్నారు. తేమ శాతం 17 దాటి ఉంటే క్వింటాల్‌కు కిలో నుంచి 5 కిలోల వరకూ తరుగుగా మినహాయించి కొనుగోలు చేస్తున్నాం. రోడ్లపై గల ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసి వేగంగా మిల్లులకు తరలిస్తున్నాం. కొవ్వూరు డివిజన్‌లోని తొమ్మిది మండలాల్లో ఆదివారం 85 లారీల ధాన్యం కొనుగోలు చేసి మిల్లులకు తరలించాం. 70 శాతం కోతలు పూర్తయ్యాయి. పెరవలి, ఉండ్రాజవరం మండలాల్లో 60 శాతం కోశారు. పొలాల్లో ఉన్న వరిచేలను ప్రస్తుతం కోయవద్దని రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. తుపాన్ తీవ్రత ఎక్కువగా ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలి.

– చంద్రశేఖర్, ఏడీఏ, కొవ్వూరు

వరి కోతలు వాయిదా వేసుకోండి

జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్


తాళ్లపూడి మండలం అన్నదేవరపేటలో ధాన్యం సంచుల గురించి ఆరా తీస్తున్న జేసీ తేజ్ భరత్

తాళ్లపూడి: తుపాను ప్రభావంతో వర్షాలు కురుస్తున్నందున రెండు రోజుల పాటు రైతులు వరి కోతలను తాత్కాలికంగా వాయిదా వేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్ సూచించారు. మాసూళ్ల చేసిన ధాన్యాన్ని ఆఫ్ లైన్‌లోనే రైస్ మిల్లులకు తరలించేందుకు, ధాన్యంలో తేమ శాతం నిబంధనలను సడలింపునకు ప్రభుత్వం అనుమతించిందన్నారు. జేసీ తేజ్ భరత్ ఆదివారం రాత్రి తాళ్లపూడి మండలంలో పర్యటించారు. మిల్లులకు వెళుతున్న ధాన్యం ట్రాక్టర్లను పరిశీలించారు. కళ్లాల్లోని ధాన్యాన్ని తడవకుండా మిల్లులకు తరలించేందుకు సంచులు సరఫరా వంటి ఏర్పాట్లు చేయాలని రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులను ఆయన ఆదేశించారు. జేసీ ఆదేశాల మేరకు సోమవారం ఉదయం నుంచి తహసీల్దార్ టి.రాధిక, ఏవో జి.రుచిత వ్యవసాయ శాఖ సిబ్బంది అప్రమత్తమై చర్యలు చేపట్టారు. కోసిన ధాన్యాన్ని మాత్రం ఆర్బీకే సిబ్బంది ద్వారా నచ్చిన మిల్లుకు పంపుకునేలా మార్పులు చేశామని తెలిపారు. వేగేశ్వరపురం, అన్నదేవరపేట, తాళ్లపూడి తదితర గ్రామాల ధాన్యాన్ని రైతులకు తరలించారు.

ఆధునీకరించిన చర్చి ప్రారంభం

గోపాలపురం: పేదలకు సేవ చేయడం ద్వారా దైవత్వాన్ని పొందవచ్చని ఏలూరు పీఠాధిపతి జయరావు పొలిమేర అన్నారు. మండలంలోని వేళ్లచింతలగూడెం ఆధునీకరించిన ఆర్‌సీఎం చర్చిని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జయరావు మాట్లాడుతూ దైవ సేవతో పాటు పేదలకు సేవ చేయాలన్న సంకల్పాన్ని గురువుల ద్వారా సంఘస్తులు నేర్చుకోవాలన్నారు. ఆర్‌సీఎం చర్చిలో ఫాదర్‌గా 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఫాదర్ కాటం బల్తజార్‌ను ఈ సందర్భంగా జయరావు పొలిమేర ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పలువురు ఫాదర్లు, సంఘ విశ్వాసులు పాల్గొన్నారు.

శివాలయాల్లో భక్తుల రద్దీ

దాగల్లు: కార్తిక సోమవారం కావడంతో మండలంలోని శివాలయాల్లో భక్తుల రద్దీ నెలకొంది. దాగల్లు రాజరాజేశ్వరి స్వామి ఆలయం, చిక్కాల, కలవలపల్లి, ఉనగట్ల, మార్కొండపాడు ఉమామార్కండేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రాహ్మణగూడెం బాల రామలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.


దాగల్లు శివాలయంలో రాజరాజేశ్వరి స్వామి, అమ్మవార్లు

ఫిర్యాదుదారులను కలవకుండానే విచారణ

నల్లజర్ల: కర్మాగారాల నుంచి వచ్చే కాలుష్యంపై విచారణ జరపడానికి వచ్చిన అధికారి ఫిర్యాదుదారుల అభిప్రాయాలు తెలుసుకోకుండానే వెళ్లిపోయారు. ఆ అధికారి తీరుపై ఫిర్యాదుదారులు అసంతృప్తి వ్యక్తం చేశారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఘంటావారిగూడెంలో డైట్ కళాశాలకు వెళ్లే మార్గంలోని వేరుశనగ కాయలు వలిచే ఐదు కర్మాగారాల నుంచి నిత్యం వెలువడుతున్న దూగరతో సమీప నివాసితులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఘంటావారిగూడెనికి చెందిన మట్టా రామకృష్ణ, పోలుబోయిన సుబ్రహ్మణ్యం, మట్టా రాంబాబు, బొర్రా రామకృష్ణ తదితరులు జిల్లా కాలుష్య నియంత్రణ మండలికి కొద్ది రోజుల క్రితం ఫిర్యాదు చేశారు. దీనిపై సోమవారం ఆ కార్యాలయ అధికారి అనసూయ పరిశీలనకు వచ్చారు. ఆమె కనీసం ఫిర్యాదుదారులకు విచారణ విషయం చెప్పకుండా గుట్టుగా ఫ్యాక్టరీలను పరిశీలించి వెళ్లి పోసాగారు. ఆమె ఫ్యాక్టరీలను తనిఖీ చేస్తుండగా, ఫిర్యాదుదారులు ఫొటోలు తీయబోగా, వద్దని ఆమె హెచ్చరించారు. ఫిర్యాదుదారులు అనసూయ వద్దకు వెళ్లి తాము చెప్పే వివరాలు నమోదు చేసుకోవాలని కోరగా అంగీకరించలేదు. తాను చేసిన విచారణ వివరాలు చెప్పడానికి కూడా ఆమె నిరాకరించారు. ఈ విషయం తెలిసి విలేకరులు ఆ ప్రాంతానికి వెళ్లేసరికే ఆమె వెళ్లిపోయారు. ఫోన్ చేసి విలేకరులు వివరాలు కోరగా ఈఈ పంపిస్తే వచ్చానని, పత్రికల్లో ఈ వార్త వేయవద్దని సూచించారు. గతంలోనూ ఈ కర్మాగారాల కాలుష్యంపై ఆరోపణలు వచ్చాయి.


కర్మాగారాల తనిఖీకి వచ్చిన అధికారి అనసూయ

మండల కమిటీల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్లు

డివిజన్‌లో ధాన్యం సేకరణ ఇలా..

	మెట్రిక్ టన్నుల్లో
వచ్చిన మొత్తం దిగుబడి:	1,51,620.88
ఆన్‌లైన్ ద్వారా సేకరణ:	73,595.41
ఓపెన్ మార్కెట్ విక్రయం:	72,446.9
రైతుల వద్ద ఉన్న నిల్వ:	5,578
రెండు రోజులుగా సేకరించిన ధాన్యం:	4,626
ఇంకా సేకరించాల్సిన ధాన్యం:	952.28


కొవ్వూరులో కళ్లంలో ధాన్యం ఉన్న రైతుతో మాట్లాడుతున్న మండలస్థాయి కమిటీ అధికారులు

కొవ్వూరు: కొవ్వూరు డివిజన్‌లో ఇప్పటి వరకూ మాసూళ్లు పూర్తి చేసిన రైతుల నుంచి 1,51,620 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చింది. దీనిలో ఆన్‌లైన్‌లోను, బహిరంగ మార్కెట్‌లోను 1,46,042 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని విక్రయించారు. రైతుల వద్ద మరో 5,578.28 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉన్నట్టు అధికారులు గుర్తించారు. తుపాను నేపథ్యంలో రైతులు ఇబ్బందులు పడకుండా ధాన్యం సేకరణకు ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. నేరుగా ఆఫ్‌లైన్ ద్వారా ఏ మిల్లుకైనా సరే తరలించుకునే వెసులుబాటు రైతులకు కల్పించారు. దీని కోసం ప్రతి మండలానికి ప్రత్యేక అధికారులను నియమించింది. వారితో పాటు ఎంపీడీవో, తహసీల్దార్, వ్యవసాయ శాఖ అధికారులతో ఒక కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ఆధ్వర్యంలో మండల స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు, తుపాను ప్రభావంపై సమీక్షిస్తున్నారు. ఎక్కడెక్కడ ధాన్యం నిల్వలున్నాయో గుర్తించి సంబంధిత రైతులతో మాట్లాడి మిల్లులకు తరలిస్తున్నారు. కొవ్వూరు రెవెన్యూ డివిజన్‌లో రెండు రోజులలో 4,626 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లర్లకు ఆఫ్ లైన్ ద్వారా తరలించారు. మరో 952.28 మెట్రిక్ టన్నుల ధాన్యం పొలాల్లో ఉన్నట్టు అధికారులు గుర్తించారు. ప్రధానంగా మండలాలవారీగా తాళ్లపూడిలో 154.78 మెట్రిక్ టన్నులు, కొవ్వూరులో 187.5, దేవరపల్లిలో 120, నల్లజర్లలో 169 మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల వద్ద కళ్లాల్లో ఉన్నాయి. దాగల్లు, ఉండ్రాజవరం, గోపాలపురం, నిడదవోలు మండలాల్లో కళ్లాల్లో కాస్త తక్కువగా ధాన్యం నిల్వలున్నాయి. దీంతో మండల కమిటీలోని అధికారులు ఆయా రైతులతో నిరంతరం మాట్లాడుతున్నారు.

అధికారులు అప్రమత్తం

స్థానిక ఆర్డీవో కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి నిరంతరం ధాన్యం కొనుగోలు, తుపాను పరిస్థితిని అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే కొవ్వూరు ఇన్‌చార్జ్ ఆర్డీవో రామావత్ కృష్ణ నాయక్, మండల స్థాయి కమిటీ అధికారులతో కలసి ఆయా మండలాల్లో పర్యటించారు. సురక్షిత ప్రాంతాలకు ధాన్యం తరలింపుపై ప్రత్యేక దృష్టి సారించారు.

జనవరిలో రెండో దశ ఆరోగ్య సురక్ష

కార్యక్రమంపై నల్లజర్లలో ఇంటింటి ప్రచారం

నల్లజర్ల: జగనన్న ఆరోగ్య సురక్ష రెండో దశ కార్యక్రమం 2024 జనవరి నుంచి ప్రారంభం కానున్నది. ఈ కార్యక్రమం విజయవంతానికి వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగులు ఇప్పటి నుంచే ఇంటింటికీ వెళ్లి విస్తృత ప్రచారం ప్రారంభించారు. గ్రామస్థాయి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు (ఎంఎల్‌హెచ్‌పీ), ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు ఈ ప్రచారంలో పాల్గొంటున్నారు. ఆరోగ్యశ్రీ పథకంపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పిస్తున్నారు. ఆరోగ్యశ్రీ సేవలపై ప్రభుత్వం ముద్రించిన బ్రోచర్‌ను వారు ఇంటింటికీ అందిస్తున్నారు. ఏదైనా అనారోగ్య సమస్య తలెత్తినప్పుడు ఆరోగ్యశ్రీ ద్వారా ఏవిధంగా సులభంగా వైద్య సేవలు పొందవచ్చో వివరిస్తున్నారు. వైద్యం ఖర్చు రూ.వెయ్యి దాటితే ఆరోగ్యశ్రీ వర్తిస్తుందని వివరిస్తున్నారు. మొత్తం 3257 రకాల వైద్య సేవలకు ఆరోగ్యశ్రీ వర్తిస్తుందని ఈ పథకం ద్వారా సులువుగా వైద్యం అందించేందుకు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ యాప్‌ను ప్రభుత్వం రూపొందించినట్టు వివరిస్తున్నారు. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రుల వివరాలను ఈ యాప్ ద్వారా ఎలా వినియోగించుకోవచ్చో చెబుతున్నారు.


నల్లజర్లలో ఆరోగ్య సురక్ష కార్యక్రమం గురించి వివరిస్తున్న వైద్య ఉద్యోగులు

చంద్రవరంలో 'వై ఏపీ నీడ్స్ జగన్'

దాగల్లు: మండలంలోని చంద్రవరం సచివాలయం పరిధిలో సోమవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. గత నాలుగున్నరేళ్లలో అమలైన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించే సమాచార బోర్డును ఈ సచివాలయం వద్ద ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు ఆవిష్కరించారు. అనంతరం గ్రామ కూడలిలో వైఎస్సార్ సీపీ జెండాను ఎగుర వేశారు. వై ఏపీ నీడ్స్ బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. పార్టీ నాయకుల ఇళ్ల వద్ద జెండాలను ఎగురవేసి పల్లె నిద్ర చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మట్టా వీరాస్వామి, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు చెల్లింకుల దుర్గా మల్లేశ్వరరావు, సర్పంచ్ మద్దిపాటి శ్రీరామమూర్తి, స్థానిక నాయకులు బండి అశోక్‌బాబు, ఎల్లె రాజు, భట్టు రాజు, సచివాలయ అధికారులు, వలంటీర్లు పాల్గొన్నారు.


చంద్రవరంలో సమాచార బోర్డును ఆవిష్కరించిన ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు

36 లీటర్ల సారాతో ఇద్దరి అరెస్టు

నల్లజర్ల/దేవరపల్లి: మండలంలోని పుల్లలపాడు, తెలికిచెర్ల గ్రామాల్లో సోమవారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. పుల్లలపాడు గ్రామంలో సిరిబత్తుల ఆంజనేయులు అనే వ్యక్తిని అరెస్టు చేసి, అతడి వద్ద ఉన్న 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. అలాగే తెలికిచెర్లలో తాడిపర్తి నాగేశ్వరరావును అరెస్టు చేసి అతడి వద్ద నుంచి 16 లీటర్ల సారా స్వాధీనం చేసుకొన్నారు. వారిద్దరినీ కోర్టులో హాజరు పరిచినట్టు దేవరపల్లి ఎస్ఈబీ సీఐ డి.సుధ తెలిపారు.


ఎమ్మార్పీఎస్ మండల కమిటీ

ఉండ్రాజవరం: మందా కృష్ణ మాదిగ నాయకత్వంలోని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) మండల శాఖ సమావేశాన్ని సోమవారం రాష్ట్ర నాయకుడు దిద్దే మధుబాబు ఆధ్వర్యంలో ఉండ్రాజవరంలో నిర్వహించారు. సమావేశానికి ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గద్దం వినోద్, రాజానగరం ఇన్‌చార్జ్ బంటువల్లి బాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎమ్మార్పీఎస్ మండల కమిటీని ఈ సమావేశంలో ప్రకటించారు. అధ్యక్షుడిగా న్యాయవాది బొల్లిపో సునీల్‌రాజ్, గౌరవాధ్యక్షుడిగా సనమండ్ర అదాము, ఉపాధ్యక్షుడిగా నేకూరి రత్నరాజు, ప్రధాన కార్యదర్శిగా మండవల్లి అనిల్ కుమార్, కార్యదర్శిగా కొమ్ము వెంకట్రావు, కోశాధికారిగా యల్లమిల్లి వెంకటేశ్వరరావు, అధికార ప్రతినిధిగా గాలంకి సంతోష్ నియమితులయ్యారు.

వృద్ధాశ్రమంలో అన్న సమారాధన

నిడదవోలు: స్థానిక కైలాసభూమి సమీపంలో నిర్వహిస్తున్న చర్ల సుశీల వృద్ధాశ్రమంలో మానవత సంస్థ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో సోమవారం వృద్ధులకు అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో మానవత సంస్థ మండల శాఖ అధ్యక్షుడు కాజ గంగరాజు, షున్నమట్ల సత్యభాస్కరప్రసాద్, లీలాలక్ష్మి, తన్నీడి బోసు, ఏపీ రమణ, నీలం రామారావు, దారపురెడ్డి సూర్యచంద్రరావు, కాళ్ళ లక్ష్మణరావు, కూరాకుల వెంకట్రావు, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

వీడని ముసురు .. ముంపులో లోతట్టు ప్రాంతాలు


నిడదవోలు సమీపంలోని తాళ్లపాలెంలో ధాన్యం బస్తాలను వాహనంలో లోడ్ చేస్తున్న కూలీలు


గోపాలపురం మండలం చిట్యాలలో ధాన్యం రాసిపై బరకాలు కప్పిన దృశ్యం


వేగేశ్వరపురం నుంచి వర్షంలోనూ సురక్షితంగా మిల్లుకు ధాన్యం తరలింపు

- తుపాను ముందస్తు హెచ్చరికలతో సత్ఫలితాలు
- ధాన్యం తడవకుండా మిల్లులకు తరలింపు
- రైతులకు అండగా రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు

నిడదవోలు: మిచాంగ్ తుపాను ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో నిడదవోలు ప్రాంతంలో జన జీవనం అస్తవ్యస్తంగా మారింది. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ వర్షం కురుస్తూనే ఉండడంతో లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. నిడదవోలు తహసీల్దారు ఎం.గంగరాజు, ఏవో జి.సత్యనారాయణ పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. రైతులను అప్రమత్తం చేస్తూ నూర్పిడి చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించేలా చర్యలు చేపట్టారు. గత రెండు రోజుల్లో రైతుల నుంచి 1,500 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఆఫ్‌లైన్‌లో కొనుగోలు చేసినట్టు అధికారులు తెలిపారు. వాహనాలకు జీపీఎస్ లేకుండా ఏ వాహనంలోనైనా రైతులు తమ నచ్చిన మిల్లులకు ధాన్యాన్ని ఎగుమతి చేసుకోవచ్చని వారు తెలిపారు. వర్షాల వల్ల వ్యాధులు ప్రబలకుండా నిడదవోలు మునిసిపాలిటీ పరిధిలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టారు.

దాగల్లు: సోమవారం ఉదయం నుంచీ విడవకుండా కురుస్తున్న వర్షాలతో పౌర జీవనానికి అంతరాయం కలిగింది. మండలంలోని పలు ప్రాంతాలు జలమయం అయ్యాయి. వర్షానికి జడిసి ప్రజలు ఇళ్లలో నుంచి బయటకు రాలేదు. రోడ్లు, డ్రైన్లు పలు గ్రామాల్లోని పల్లపు ప్రాంతాలు నీట మునిగాయి. భారీ వర్షాల నేపథ్యంలో తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్టు తహసీల్దార్ కె.రాజ్యలక్ష్మి తెలిపారు. 24 గంటలూ అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు.

గోపాలపురం: వారం రోజులుగా ప్రభుత్వం తుపాను హెచ్చరికలు చేయడంతో మండలంలోని ఖరీఫ్ రైతులు జాగ్రత్త పడ్డారు. సోమవారం ఉదయం నుంచీ ఎడతెరిపి లేకుండా మండలంలో వర్షం కురుస్తోంది. అయితే మండలంలోని 70 శాతం విస్తీర్ణంలోని వరి పంటను రైతులు నూర్పిడి చేసి, ధాన్యాన్ని మిల్లులకు తరలించారు. కాగా తుపాను తాకిడికి మెట్ట ప్రాంతంలో ప్రధాన వాణిజ్య పంట అయిన వర్జీనియా పొగాకు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికి నాట్లు వేసి సుమారు 20 నుంచి 30 రోజులు కావస్తోంది. తోటలు పెరుగు దశలో ఉండగా తుపాను రావడం కొంత నష్టం తప్పదని రైతులు పేర్కొంటున్నారు.

తాళ్లపూడి: మండలంలో సోమవారం ఉదయం నుంచీ వర్షం కురుస్తూనే ఉంది. ప్రస్తుతం ఖరీఫ్ వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. యంత్రాల ద్వారా కోసిన ధాన్యాన్ని రోడ్లపైనా, పుంత రోడ్ల పైన రైతులు రాసులుగా పోసి రైతులు బరకాలు కప్పి ఉంచారు. అధికారుల చొరవతో లారీలపై ధాన్యం బరకాలు కప్పి మిల్లుకు తరలిస్తున్నారు. మండలంలో వరి కోతలు పూర్తిగా నిలిపి వేశారు.